సాక్షి
చిత్తూరు
ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



బాదుడే బాదుడు అంటే ఇదే

ఐదేళ్లు కరెంటు చార్జీలు పెంచనని చెప్పిన చంద్రబాబు అధికారంలోకొచ్చిన 5 నెలల్లోనే జనం నెత్తిన భారం మోపారు. - 8లో



సీసీ రోడ్లలో నాణ్యత తప్పనిసరి

సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. - 8లో



హోరాహోరీగా ఖోఖో పోటీలు

ఐరాల మండలంలో శుక్రవారం ప్రారంభమైన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు రెండో రోజు హోరాహోరీగా సాగాయి. - 8లో

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి ముందుంటా!



ప్రజాప్రతినిధులతో కలిసి బోర్ మోటార్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: జిల్లా ప్రజలకు ఎప్పుడు ఎటువంటి ఇబ్బంది వచ్చినా దాన్ని పరిష్కరించడానికి ముందు వరుసలో ఉంటానని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని జవునపల్లి పంచాయతీ నాగులకుంట గ్రామంలో శనివారం జెడ్పీ నిధుల ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ఆయన ప్రారంభించారు. బోరులో నీరు పుష్కలంగా ఉన్నట్లు జెడ్పీ చైర్మన్ తెలిపారు. నాగులకుంట గ్రామస్తులు కొంత కాలంగా తాగునీటి కొరతతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే స్పందించి జిల్లా పరిషత్ నిధులతో బోరు వేయించినట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి కష్టమొచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, వైస్ సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ శివరంజని, గిరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి నగదు విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్య అన్నదాన ట్రస్టుకు దాత శనివారం నగదు విరాళం అందించారు. తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లెకు చెందిన సుబ్రమణ్యంరెడ్డి రూ.1,01,116 నగదును ఆలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి వారు దర్శన ఏర్పాట్లు చేసి స్వామి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి తదితరులున్నారు.

మెగా డీఎస్సీకి ఖాళీలను పరిశీలించండి

చిత్తూరు కలెక్టరేట్ : త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీకి ఖాళీలను పరిశీలించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఖాళీల కసరత్తు అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలిచ్చారు. జిల్లాలో ఉన్న వివిధ కేడర్ల టీచర్ల ఖాళీలను, రోస్టర్ పాయింట్లను పరిశీలించి ఆమోదించాలన్నారు. ఇందుకు కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ కమిటీలోని సభ్యులు పకడ్బందీగా కసరత్తు నిర్వహించి ఈ నెల 28వ తేదీ లోపు నివేదికలను రాష్ట్ర విద్యాశాఖకు పంపాలని డీఈఓలను ఆదేశించారు.

సీఎం హోదాలో చంద్రబాబు కుప్పానికి వస్తే వెంటనే కృష్ణా జలాలు గుర్తుకువస్తాయి. డిసెంబర్‌లో కృష్ణా జలాలు కుప్పానికి తరలిస్తాం అంటూ ఒక ప్రకటన గుప్పిస్తారు. అంతే ఆ తరువాత ఐదు డిసెంబర్‌లు వచ్చినా కృష్ణా జలాలు మాత్రం రాలేదు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నాలుగేళ్లలోనే కృష్ణా జలాలను కుప్పానికి తరలించారు. అయితే ఈ మంచి పేరు జగన్‌కు రాకుండా ఉండేందుకు పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు మంగళం పలికారు. లైనింగ్ పనులు మొదలెట్టేశారు. దీంతో ఆ కాలువలో వచ్చే అరకొర నీరే కుప్పం వరకు తరలించాలి. కాలువ విస్తరణకు గండికొట్టిన చంద్రబాబు ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు.





పెద్దపంజాణి మండలంలో ఎండిన కుప్పం బ్రాంచి కెనాల్


కృష్ణమ్మా.. కుప్పానికి రాలేవా?

- పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు మంగళం
- దీంతో కరువు ప్రాంతానికి కృష్ణా జలాలు అందడం కలేనా?
- ఈ సమస్యపై నోరుమెదపని టీడీపీ ఎమ్మెల్యేలు
- కుప్పానికి నీళ్లు ఇస్తామన్న చంద్రబాబు హామీ హుళక్కే

పలమనేరు: గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు సీఎం హోదాలో కుప్పానికి వచ్చిన ప్రతిసారీ డిసెంబర్‌లో కృష్ణా జలాలను తరలిస్తామంటూ ప్రకటించి, చివరకు కాలయాపన చేసి అప్పట్లో ఎన్నికలు సమీపిస్తుండడంతో మూన్నాళ్ల ముచ్చటగా కుప్పం బ్రాంచి కెనాల్‌కు నీళ్లు వదిలారు. ఆపై అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మొన్నటి ఎన్నికల ముందు కుప్పానికి కృష్ణా జలాలను తరలించిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కుప్పానికి నీళ్లిస్తుందని ఇక్కడి రైతులు భావించారు. అయితే గత ప్రభుత్వం చేపట్టిన హంద్రీనీవా కాలువ ఫేజ్–2కు సంబంధించి పుంగనూరు ఉపకాలువ(పీబీసీ) పనులను కూటమి ప్రభుత్వం నిలిపేసింది. దీంతో విస్తరణ పనులు ఆగిపోయాయి. ఫలితంగా ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు ఇప్పట్లో రాని పరిస్థితి నెలకొంది. కుప్పం కాలువలో కూడా ఇక గడ్డి మొలవడం ఖాయం. ఇక్కడి రైతులకు ఇంతటి అన్యాయం జరుగుతున్నా టీడీపీ ఎమ్మెల్యేలు దీనిపై నోరుమెదపకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

2019 నుంచి 2024 దాకా పారిన కృష్ణా జలాలు

పుంగనూరు ఉపకాలువకు నీరు చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి వస్తుంది. ఈ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 1,608 టీఎంసీలు. ఈ రిజర్వాయర్ నుంచి పీటీఎం మీదుగా పుంగనూరు ఉప కాలువకు వస్తాయి. 2019లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లోపు పీబీసీ, కేబీసీలకు నీళ్లు ఇవ్వాలనే ఆత్రుతతో నాలుగు నెలలు మాత్రం అప్పట్లో 700 ఎంసీఎఫ్‌టీ(మిలియన్ క్యూబిక్ ఫీట్)నీటిని తరలించింది. ఆపై అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో మూడేళ్ల పాటు 5.92 టీఎంసీల నీటిని తరలించారు. ఆ నీరు కూడా కుప్పానికి చేరడంతో మూడు చెరువులను సైతం నింపారు. అదే కాలువలో కుప్పానికి వచ్చిన నీళ్లు ఇప్పుడు మాత్రం ఎందుకు రావన్న అనుమానం రైతుల్లో మొదలైంది.



గంగవరం మండలం పశపత్తూరు వద్ద గత ప్రభుత్వంలో నిర్మించిన లిఫ్ట్

కాలువ విస్తరణతో ఎంతో మేలు

పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు పూర్తయితే భవిష్యత్తులోనైనా పుంగనూరు, కుప్పం ప్రాంతానికి నీటి సమస్య పరిష్కారమయ్యేది. ఇందుకోసమే గత ప్రభుత్వం రూ.1,217 కోట్లతో ఈ పనులను చేపట్టింది. గత నెల పెద్దపంజాణి మండలంలో కుప్పం బ్రాంచి కెనాల్‌ను పరిశీలించిన జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు సైతం కాలువ విస్తరణతో ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందన్నారు. భవిష్యత్తులో సాగునీటి కష్టాలు తీరినట్లేనని ఇక్కడి రైతులు సైతం ఆనందపడ్డారు. హఠాత్తుగా ఇప్పుడు కాలువ విస్తరణ పనులను ఆపేసిన సర్కారు లైనింగ్ పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. దీంతో ఈ కాలువలో నీళ్లు రాక, విస్తరణకు వీలు కాకుండా పోయింది. లైనింగ్ పనుల పేరిట తమకు కావాల్సిన కంపెనీలకు పనులిచ్చుకుంటూ ఈ ప్రాంతానికి ఇప్పట్లో నీరందించకుండా కాలయాపన చేసేందుకే కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది.

టీడీపీ ఎమ్మెల్యేలు స్పందించాలి

పీబీసీ కాలువకున్న సామర్థ్యం 380 క్యూసెక్కులు. అదే విస్తరణ పనులు పూర్తయి ఉంటే దీని ప్రవాహ సామర్థ్యం 1,180 క్యూసెక్కులకు చేరేది. ఫలితంగా ఎక్కువగా కృష్ణా జలాలు ఈ ప్రాంతానికి వచ్చేవి. ఈ ఉద్దేశంతోనే గత ప్రభుత్వం విస్తరణ పనులు చేపట్టింది. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి, పుంగనూరు, మదనపల్లె, పీలేరు, కుప్పం నియోజకవర్గాలకు సాగునీటి సమస్య తీరేది. మరోవైపు అడవిపల్లి, శ్రీనివాసపురం రిజర్వాయర్ల నుంచి చిత్తూరు సమీపంలోని ఎన్టీఆర్ జలాశయానికి నీరందేది. ఫలితంగా చిత్తూరు, పూతలపట్టు,గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు మేలు జరిగేది. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మినహా మిగిలిన వారంతా టీడీపీ ఎమ్మెల్యేలే కాబట్టి వారి సొంత నియోజకవర్గాల రైతుల ప్రయోజనం కోసం ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి గట్టిగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుంగనూరు కోర్టు తనిఖీ



న్యాయవాదులతో సమావేశమైన జిల్లా జడ్జి భీమారావు, పక్కన న్యాయమూర్తి శిరీష్, మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: పట్టణంలోని సీనియర్ సివిల్‌జడ్జి కోర్టును జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు శనివారం తనిఖీ చేశారు. ప్రధాన న్యాయమూర్తికి సీనియర్ సివిల్‌జడ్జి శిరీష్, మాజీ ఎంపీ, సీనియర్ న్యాయవాది రెడ్డెప్ప, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు కలసి స్వాగతం పలికారు. జిల్లా జడ్జి న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. పుంగనూరు పట్టణంలోని మూడు కోర్టులకు న్యాయమూర్తులను నియమించాలని న్యాయవాదులు కోరారు. దీని కారణంగా కేసులు పెండింగ్ పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా జడ్జి మాట్లాడుతూ త్వరలోనే న్యాయమూర్తులను నియమించాలని హైకోర్టుకు నివేదికలు పంపుతామన్నారు. డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వెంకట్రామయ్యశెట్టి, బాలాజికుమార్, వై.భాస్కర్‌రెడ్డి, హరినాథరెడ్డి, వినోద్‌కుమార్, అంజిబాబు, చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుని సేవలో కర్ణాటక ఉప లోకాయుక్త



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న కర్ణాటక ఉప లోకాయుక్త జస్టిస్ వీరప్ప

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం కర్ణాటక ఉప లోకాయుక్త జస్టిస్ వీరప్ప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తులో ఆలస్యం ఎందుకు?






సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ, పాల్గొన్న పోలీసు అధికారులు

- సైబర్ నేరాలను తిప్పికొట్టండి
- బాధితులు 1930కి ఫిర్యాదు చేయండి
- నేర సమీక్షలో చిత్తూరు ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పెద్ద నేరాల (గ్రేవ్) కేసుల్లో దర్యాప్తు ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయడం లేదని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అధికారులను ప్రశ్నించారు. వీలైనంత త్వరగా పెండింగ్ కేసుల్లో దర్యాప్తు పూర్తిచేసి, న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో శనివారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో నిర్లక్ష్యం వద్దని, ఎప్పటికప్పుడు దర్యాప్తు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారమంతా డీఎస్పీలు పర్యవేక్షించి, చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో, పట్టణాలు, నగరాల్లోని ప్రధాన కూడళ్లల్లో కెమెరాలు విరివిగా ఉపయోగించాలని సూచించారు. అపార్ట్‌మెంటు వ్యవస్థ, కమ్యూనిటీ హాల్స్ ఉన్న చోట కెమెరాల వినియోగంలో స్థానికులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. నిత్యం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వాళ్లపై పీడీ యాక్టులు పెట్టడానికి ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. ఒకసారి నిందితులను అరెస్టు చేసిన తరువాత, వాళ్లపై నేరం రుజువుచేయడానికి సరైన సాక్ష్యాలు సేకరించి, కోర్టుకు సమర్పించాల్సిన బాధ్యత దర్యాప్తు అధికారిదేనని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లు ప్రతి రోజూ విసురుతున్న సరికొత్త సవాళ్లను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వాళ్లు మొహమాట పడకుండా వెంటనే ఫోన్–1930కు తక్షణం సమాచారం ఇవ్వాలన్నారు. ఇక స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

షాడోలా.. మజాకా!

- కుప్పం నుంచి గూడూరు దాకా పెత్తనమంతా షాడో ఎమ్మెల్యేలదే
- ఎమ్మెల్యేని కలవాలంటే ముందుగా షాడో చెప్పాలి
- పనులైనా.. పైరవీలకైనా అంతా వారి కనుసన్నల్లోనే
- అధికారుల బదిలీలు జరిగినా వారి ఆధీనంలోనే
- టెండర్లు, మద్యం, ఇసుక దందాల్లో ఇష్టారాజ్యం
- సెటిల్ మెంట్లలో షాడోలే ముందు.. ఆ తర్వాత పంపకాలు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో షాడోల పెత్తనంపై గుర్రుమంటున్న పార్టీ శ్రేణులు



సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఎమ్మెల్యేల కంటే షాడో ఎమ్మెల్యేల పెత్తనం అధికమైంది. షాడోలను ఎమ్మెల్యేలే ప్రోత్సహిస్తుండడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యేని కలవాలన్నా.. పనులు, కాంట్రాక్టులు, పదోన్నతులు, బదిలీలు, మద్యం, ఇసుక వ్యవహారాలు ఇలా ఏదైనా.. ముందు షాడో ఎమ్మెల్యేని కలవాలి. ఆయన గారు ఓకే అంటేనే.. ఎమ్మెల్యేతో కలిసే భాగ్యం కలుగుతుంది. లేదంటే.. అట్నుంచి అటే ఇంటిదారి పట్టాల్సిందే. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కూటమి ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పరిస్థితిపై ఆ పార్టీల నేతలు అధినాయకులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

తిరుపతిలో త్రిముఖ పోటీ!

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు శివ, కుమారుడు మదన్‌మోహన్, పట్టణ జనసేన అధ్యక్షులు రాజారెడ్డి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో కూడా ఎమ్మెల్యే హోదాలో పాల్గొంటున్నారు. అధికారుల బదిలీలు, పదోన్నతులు, టెండర్లు, తిరుమలలో శ్రీవారి దర్శన టికెట్లు, ఇతర పార్టీ శ్రేణులను జనసేనలోకి చేర్చుకునే విషయంలోనూ ఆరణి శివ కీలకంగా వ్యవహరిస్తున్నారు. భూ సెటిల్‌మెంట్లలో శివ చురుగ్గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇతని దూకుడు చూసిన ఎమ్మెల్యే కుమారులు ఆరణి మదన్‌మోహన్, జగన్‌మోహన్ కూడా షాడో ఎమ్మెల్యేల అవతారం ఎత్తారు.

కుప్పం.. శ్రీకాంత్‌కే కప్పం!

కుప్పం ఎమ్మెల్యే, ప్రస్తుత సీఎం కూడా చంద్రబాబు. అయితే కుప్పంలో చక్రం తిప్పేది ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్. ఆయనే ఇక్కడ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులను పక్కనబెట్టిన చంద్రబాబు ప్రకాశం నుంచి తీసుకొచ్చిన శ్రీకాంత్‌ను కుప్పంలో ఉంచారు. ఆయనకే పనులు చక్కబెట్టే బాధ్యతను అప్పగించారు. నియోజకవర్గంలో ఏ చిన్న పని కావాలన్నా ఎమ్మెల్సీ నుంచి ఫోన్ వెళ్లాలి. అయనగారిని కాదని నియోజకవర్గంలో ఏ అధికారి టీడీపీ, జనసేన నాయకులకు పనులు చేసిపెట్టరు. అధికారుల బదిలీలు, పదోన్నతులు, సెటిల్ మెంట్లు, ఇతర పార్టీ నేతలపై అక్రమ కేసులు, పార్టీలో చేర్చుకోవడం వంటి అన్ని విషయాల్లో శ్రీకాంత్ హస్తం ఉండాల్సిందే. కలెక్టర్, ఎస్పీ కూడా శ్రీకాంత్ చెప్పినట్లు వినాల్సిందే.

శ్రీకాళహస్తిలో అమ్మదే పెత్తనం!

శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్థానికంగా లేనప్పుడు తల్లి బొజ్జల బృందమ్మ, భార్య షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తుంటారు. అధికారులు, నాయకులు వీరిద్దరినీ కలిసి పనులు చక్కబెట్టుకుంటుంటారు. చంద్రగిరిలో పులివర్తి సుధ అన్నీ తానై వ్యవహరిస్తుంటారనే ప్రచారం ఎక్కువగా ఉంది.

చిత్తూరు..షాడోల జోరు

చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోదరుడు జీవన్, ఎన్‌ఆర్ఐ రవి, వసంత్ ముగ్గురూ సెటిల్ మెంట్లు, భూ తగాదాలు సృష్టించి డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గ్రానైట్ క్వారీలు లాక్కుని వేరొకరికి లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. మరో వైపు పేకాట శిబిరాలను కూడా వీరే నడుపుతూ డబ్బులు సంపాదిస్తున్నట్లు చిత్తూరు నగరంలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

పూతలపట్టు.. జయప్రకాష్‌కే పట్టు!

పూతలపట్టులో బంగారుపాళెంకు చెందిన జయప్రకాష్ నాయుడు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నాడు. జయప్రకాష్ లెటర్ పంపితే ఎమ్మెల్యే మురళీమోహన్ సంతకాలు చేసి పంపుతుంటారనే ప్రచారం ఉంది.

సత్యవేడులో చక్రం తిప్పుతున్న సుమన్

సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు కోనేటి సుమన్ నియోజకవర్గంలో చక్రం తిప్పుతున్నారు. అధికారుల బదిలీలు, పోస్టింగ్స్, ఇసుక అక్రమ రవాణా, సెటిల్‌మెంట్లు అన్నింటా సుమన్ పాత్ర ఉంటుందనే ప్రచారం ఉంది. తండ్రి ఎమ్మెల్యే వద్దకంటే కుమారుడు సుమన్ వద్దకే నాయకులు, అధికారులు పనులు కోసం వెళ్తుంటారు.

అక్కడ కొండెపాటిదే రాజ్యం

గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యే కంటే.. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండెపాటి గంగాప్రసాద్ పెత్తనమే ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారుల బదిలీలు, పోస్టింగ్స్, సిలికా, ఇసుక వంటి మైనింగ్ తవ్వకాలు, రవాణా, భూముల సెటిల్‌మెంట్లు అన్నింటా గంగాప్రసాద్ పాత్ర ఉందనే ప్రచారం జరుగుతోంది. ఆయన అనుచరుడు నానాజీ పెత్తనం కూడా ఎక్కువే. సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి రాజకీయ అనుభవం లేక పోవడంతో తండ్రి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. గ్రావెల్, ఇసుక, మట్టి, బియ్యం రవాణా వంటి వ్యాపారాలన్నీ ఆయనే చూస్తుంటారనే ప్రచారం ఉంది.

చిట్టిబాబు చుట్టూ జీడీనెల్లూరు!

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో చిట్టిబాబు నాయుడు షాడో ఎమ్మెల్యేగా చలామణి అవుతున్నారు. మొదట్లో ఎమ్మెల్యే థామస్‌కి ఈయనకు పడకపోయినా.. చంద్రబాబు రాజీ కుదిర్చినట్లు తెలిసింది. అప్పటి నుంచి చిట్టిబాబు నాయుడు ఇసుక, గ్రానైట్ అక్రమంగా తవ్వి తమిళనాడుకు తరలించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా మైనింగ్ వ్యాపారులతో డీలింగ్స్ ఇతనే చూసుకుంటారని చెబుతున్నారు.

ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా అఫ్సర్ ఖాన్



ఉర్దూ ఇన్‌స్పెక్టర్ అఫ్సర్‌ఖాన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఉన్న ఉర్దూ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా అఫ్సర్ ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. రామకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయన 1997లో ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరారు. అనంతరం 2001 లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. 2021లో కల్పించిన ఉద్యోగోన్నతుల ప్రక్రియలో గ్రేడ్ 2 హెచ్‌ఎంగా మళ్లీ ఉద్యోగోన్నతి పొందారు. తాజాగా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,501 మంది స్వామివారిని దర్శించుకోగా 21,203 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.78 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

టీడీపీ నాయకుల బాహాబాహీ



కొట్టుకుంటున్న టీడీపీ నాయకులు

శ్రీరంగరాజపురం : టీడీపీ నాయకులు బాహాబాహీకి దిగిన సంఘటన మండలంలోని ఎగువ కమ్మకండ్రిగ పంచాయతీ చెరువుముందర గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఎగువ కమ్మకండ్రిగ గ్రామం టీడీపీకి చెందిన వెంకటేష్‌నాయుడికి, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణ పనులను అప్పగించారు. దీంతో వెంకటేష్ చెరువుముందర గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మొదలెట్టారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దేవరాజుల నాయుడు 'మా గ్రామంలో నీవు ఎవరు సీసీ రోడ్డు నిర్మించడానికి' అంటూ వెంకటేష్‌పై కుటుంబ సభ్యులతో కలసి దాడిచేసి గాయపరిచారు. దీంతో వెంకటేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాలికల సైనిక్ స్కూల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

తిరుపతి ఎడ్యుకేషన్: కర్ణాటకలోని కిట్టూర్ రాణి చెన్నమ్మ బాలికల రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్లో 2025–26లో 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం పోటీ పరీక్షల కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షను 2025, ఫిబ్రవరి 2వ తేదీ జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు 2013, జూన్ 1నుంచి 2015, మే 31మధ్య జన్మించిన బాలికలు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

103 గ్రామాల్లో సభలు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహిస్తున్న రీ సర్వే చేసిన 103 గ్రామాల్లో పూర్తయినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా రీ సర్వే గ్రామ సభలను ప్రారంభించారు. ఈ గ్రామ సభలను తహసీల్దార్ల సమక్షంలో పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. 329 గ్రామాల్లో రీ సర్వే గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటి వరకు 103 గ్రామాల్లో గ్రామ సభలను పూర్తి చేసి ప్రజల నుంచి 4,898 వినతులను స్వీకరించారు. 14 వినతులను పరిష్కరించారు.

రైలు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



మృతి చెందిన కానిస్టేబుల్ వడివేలు

పూతలపట్టు: రైలు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు కోయంబత్తూరుకు చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ వడివేలు(75) శనివారం ఉదయం తిరుపతి నుంచి స్వగ్రామానికి రైల్లో బయల్దేరారు. మండలంలోని హసాన్‌పురం వద్ద రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయారు. తల రైలు పట్టాల కింద పడడంతో అక్కడిక్కడే మృతి చెందారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాదుడే బాదుడు అంటే ఇదే

- జనం నెత్తిన బిల్లుల భారం
- 15 నెలలకు రూ.250 కోట్లు
- నవంబరు నుంచి అమలు
- విస్తుపోతున్న వినియోగదారులు

చిత్తూరు కార్పొరేషన్: ఐదేళ్లపాటు కరెంటు చార్జీల పెంచనని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే జనం నెత్తిన భారం మోపింది. ఉన్న ధరలను తగ్గించకపోగా ఇంధన సర్దుబాటు చార్జీని పెంచారు. డిస్కంలు ప్రతిపాదించిన కరెంటు బిల్లును ఏపీఈఆర్సీ ఆమోదించింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వినియోగదారులపై దాదాపు రూ.250 కోట్ల భారం పడనుంది. వీటిని నవంబరు నుంచి అమలు చేయనున్నారు. భవిష్యత్తులో శ్లాబులు మార్పు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బిల్లుల్లో 10 నుంచి 20 శాతం

గత ప్రభుత్వం విద్యుత్ సంస్థలను నాశనం చేసిందని, మన ప్రభుత్వం వచ్చాక కరెంటు చార్జీలను పెంచను అని ఎన్నికల ముందు శపథాలు చేసిన చంద్రబాబు ఇప్పుడు తన దుష్టబుద్ధి చూపించారు. అధికారంలో వచ్చాక ఇంధన సర్దుబాటు చార్జీ పేరుతో ప్రజలను బాదేస్తున్నారు. విద్యుత్ వినియోగదారుడుకు రూ.450 బిల్లు వచ్చింది అనుకుంటే అందులో ఇంధన సర్దుబాటు చార్జీ 10–20 శాతం కింద చూపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వినియోగదారులపై పడిన రూ.250 కోట్ల భారాన్ని 15 నెలల్లో వసూళ్లు చేయనున్నారు. ఎక్కువగా గృహవినియోగదారులపై ఈ భారం పడనుంది. వీటిని నాలుగు క్వార్టర్స్ అంటే నవంబరు–జనవరి 2025, ఫిబ్రవరి–ఏప్రిల్, మే–జూలై, ఆగస్టు–జనవరి 2026 వరకు రాబట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 8 డివిజన్లలో అన్ని రకాల సర్వీసులు కలిపి 19.52 లక్షలు ఉన్నాయి. ఇందులో గృహ సర్వీసులే 13.73 లక్షలకు పైగా ఉన్నాయి. మూడు లక్షల సర్వీసులు ఉన్న వ్యవసాయంపై ఈ భారం ఎంత వేయనున్నారో స్పష్టత లేదు.



బిల్లు తీస్తున్న ట్రాన్స్‌కో ఉద్యోగులు (ఫైల్)

కేటగిరి వారీగా సర్వీసులు	
గృహాల సర్వీసులు	13,73,346
వాణిజ్యం	1,61,215
పరిశ్రమలు	21,175
ప్రభుత్వ సర్వీసులు	46,690
వ్యవసాయం	3,17,709
వీధిదీపాలు	17,000
ఆర్‌డబ్ల్యూఎస్	13,924
హెచ్‌టీ	1906
మొత్తం	19,52,790

త్వరలో శ్లాబు మార్పు?

శ్లాబు విధానాన్ని 2015లో చంద్రబాబు కుదించారు. ప్రస్తుతం బొగ్గు, కొనుగోలు, రవాణా, డీజిల్ చార్జీల పేరిట ఇంధన సర్దుబాటు చేయనున్నారు. నవంబరు నుంచి 15 నెలలు అంటే జనవరి 2026 వరకు వీటిని వినియోగదారులపై విధించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా దాదాపు 17 కోట్ల యూనిట్లు వినియోగం జరుగుతుండగా ఎల్‌టీ, హెచ్‌టీ కలిపి మొత్తం దాదాపు రూ.360 కోట్లు విద్యుత్ బిల్లుల రూపంలో వసూలవుతోంది. ఇందులో ఎల్‌టీ ద్వారా రూ.180 కోట్ల వరకు వస్తుండగా హెచ్‌టీ ద్వారా రూ.170 కోట్ల వరకు వస్తోంది. ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయిల్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంటు) పేరిట ఇప్పుడు నెలకు రూ.16.66 కోట్లకు పైగా భారం వినియోగదారులపై వేయనున్నారు. ప్రస్తుతం శ్లాబు విధానంలో మరింత మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కిలోవాట్ల కనీస చార్జీలను పెంచాలని, శ్లాబు టారిఫ్ పెంపు యోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం 5 కిలోవాట్లతో విద్యుత్ సరఫరా తీసుకున్న వారు వాడకం జరపకపోయినా రూ.75 చెల్లించాల్సి ఉంది.

హోరాహోరీగా ఖోఖో పోటీలు



ఖోఖో పోటీలో తలపడుతున్న తూర్పుగోదావరి - కర్నూలు జిల్లా బాలికల జట్లు

- పోటీల్లో పాల్గొన్న 13 జిల్లాల క్రీడాకారులు
- నేడు ఫైనల్ పోటీలు

పూతలపట్టు/తవణంపల్లె: రాష్ట్ర స్థాయి అండర్–18 ఖోఖో క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఐరాల మండలం అగరంపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రెండో రోజు ఈ పోటీలు ఉత్కంఠగా సాగాయి. శుక్రవారం ప్రారంభించిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల్లో బాల, బాలికలు హాజరయ్యారు. మొత్తం క్రీడాకారులు 400 మంది, ఉపాధ్యాయులు 100 మంది, వలంటీర్లు 100 మందితో కలిపి మొత్తం 600 మంది ఇక్కడికి చేరుకున్నారు. శుక్రవారం లీగ్ మ్యాచ్ ప్రారంభం కాగా, శనివారం లీగ్‌మ్యాచ్ ముగిసినంతరమే సాయంత్రం క్వాటర్ ఫైనల్ మ్యాచ్‌లు ప్రారంభించారు.

నేడు ఫైనల్ పోటీలు

రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడాపోటీలు ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. శనివారం క్వార్టర్ ఫైనల్లో గెలుపొందిన 4 జట్లు ఫైనల్‌లో తలపడనున్నాయి. చివరికి గెలిచే ఆ రెండు జట్లు జాతీయ స్థాయిలో ఆడనున్నాయి. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన జట్లు నవంబర్ 25 నుంచి 29 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. ఆదివారం గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేయడానికి శాప్ చైర్మన్ రవినాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు హాజరు కానున్నారు.



ఖోఖో ఆడుతున్న బాలురు

ట్యాంకర్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- మొగిలి ఘాట్‌లో ప్రమాదం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ వద్ద ఉన్న దొరచెరువు వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ట్యాంకర్ – ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, గంగవరానికి చెందిన మోహన్ కుమారుడు హేమచందు(22), అతని స్నేహితుడు బంగారుపాళ్యానికి చెందిన అభిషేక్ కలసి ద్విచక్ర వాహనంపై పలమనేరు నుంచి బంగారుపాళెం బయలుదేరారు. మార్గమధ్యంలో మొగిలి ఘాట్ దొరచెరువు వద్ద ముందుపోతున్న డీజిల్ ట్యాంకర్‌ను ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా హేమచందు మృతి చెందాడు. అభిషేక్‌ను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన హేమచందు

మూడు రోజులుగా ప్రమాదాలు

మొగిలి ఘాట్‌లో అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రమాదాలు ఆగడం లేదు. మొగిలిఘాట్ ముందు రెండు కిలోమీటర్ల దూరం నుంచి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్ డ్రమ్‌లు ఏర్పాటు చేశారు. పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్లే వాహనాల స్పీడ్‌ను నియంత్రించేందు కోసం ప్రత్యేక చెక్ పోస్టు ఏర్పాటు చేసినప్పటికీ వాహనదారులు అవేమీ లెక్క చేయకుండా దూసుకొచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. దొరచెరువు వద్ద గత మూడు రోజులుగా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

మహిళ మెడలోని గొలుసు చోరీ

పూతలపట్టు: ఒంటరిగానున్న మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు మండలంలోని కిచ్చన్నగారిపల్లెకు చెందిన మల్లిక శనివారం సాయంత్రం గ్రామంలో ఆవులు మేపుతుండగా ఇద్దరు యువకులు మోటారు బైకుపై వచ్చి ఆమె దగ్గర ఆపి, అడ్రస్ అడిగారు. ఆమె అడ్రస్ చెబుతుండగా, మెడలోని 8 సవర్ల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో అడవి పంది మృతి



అడవి పంది కళేబరం

తవణంపల్లె: మండలంలోని దిగువ మారేడుపల్లె సమీపంలో పొలంలో విద్యుత్ షాక్‌తో అడవి పంది మృత్యువాత పడింది. ఈ సంఘటన శనివారం ఉదయం వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం మేరకు, పొలంలో సంచరిస్తున్న అడవి పంది వేటగాళ్లు వేసిన కరెంటు ఉరికి పడి మృతి చెందింది. దీంతో విద్యుత్‌సరఫరా ఆగిపోయింది. పైపల్లె విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ లైన్ తనిఖీ చేస్తుండగా అడవి పంది మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై వెంటనే పోలీసులకు, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మారేడుపల్లె దగ్గర అటవీ శాఖ అధికారి అడవి పంది పోస్టుమార్టం చేయించినట్లు తెలిపారు. విచారణ చేసి నిందితులను అరెస్టు చేస్తామన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధి హామీలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 2024–25 సంవత్సరానికిగాను 1,485 అంతర్గత సీసీ రోడ్లను మంజూరు చేశామన్నారు. వివిధ దశల్లో ఉన్న ఆ రోడ్ల పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. ప్రజాధనం ఎక్కడా వృథా అవ్వడానికి వీల్లేదన్నారు. 1279 పనులకు కాంట్రాక్టర్లను గుర్తించి వాటిని వెంటనే ప్రారంభించేలా డీఈ, ఏఈలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల అంచనాలు, పూర్తయిన తర్వాత బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సమీక్ష లో పంచాయతీ రాజ్ ఎస్ఈ శంకరనారాయణ, ఈఈ చంద్రశేఖర్, డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.1.30 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కో వ్యక్తికి రూ.పది వేల చొప్పున, 13 మంది నిందితులకు రూ.1.30 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.30 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మరో 14 మందికి జరిమానా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి 14 మందికి జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. బంగారుపాళెంలో సీఐ శ్రీనివాసులు రెండు రోజులుగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి 14 మందిపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించారు. వీళ్లపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున, రూ.14 వేల జరిమానా విధించారు. మద్యంతాగి వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఎంపీటీసీ కిడ్నాప్ కేసులో 10 మంది అరెస్ట్

గంగాధర నెల్లూరు: పాలసముద్రం మండలానికి చెందిన నరసింహపురం ఎంపీటీసీ సభ్యుడు జగన్నాథరాజు కిడ్నాప్‌కు గురై ఆ తర్వాత మృతి చెందిన కేసులో పోలీసులు 10 మంది నిందితులను అరెస్టు చేశారు. సీఐ లక్ష్మీ నారాయణ శనివారం సాయంత్రం ఆ వివరాలను వెల్లడించారు. టీబీఎస్‌ఆర్ పురానికి చెందిన జగన్నాథరాజుతోపాటు అతని స్నేహితులు చిన్నమరాజు, ఏకాంబరంతో కలిసి కారులో డ్రైవర్ శంకర్‌తో ఈనెల 21వ తేదీ సాయంత్రం బయల్దేరారు. గంగాధర నెల్లూరు మండలం అంబోదరపల్లి సమీపంలో వెళుతుండగా, వారిని మూడు కార్లలో కొందరు వ్యక్తులు వెంబడించి అడ్డగించారు. ఆ వ్యక్తులు ముందుగా జగన్నాథరాజును కారులో నుంచి బలవంతంగా దింపి వారి కారులోకి ఎక్కించారు. ఏకాంబరం, చిన్నమ రాజు, శంకర్‌ను వేర్వేరు రెండు వాహనాల్లో ఎక్కించుకున్న కిడ్నాపర్లు సమిసిరెడ్డిపల్లి వరకు ప్రయాణించారు. ఆ గ్రామం వద్దకు రాగానే కిడ్నాపర్లు వారి కారులో నుంచి ఏకాంబరం, చిన్నమరాజు, శంకర్‌ను దించేశారు. అక్కడి నుంచి జగన్నాథరాజుతో కలిసి మళ్లీ గంగాధర నెల్లూరు మీదుగా నూజివీడుకు బయల్దేరారు. ఈనెల 22వ తేదీ తెల్లవారుజామున జగన్నాథరాజును వాహనాల నెలసరి కంతులు చెల్లించాలని లేదంటే వాహనాలను తమకు స్వాధీనం చేయాలని కిడ్నాపర్లు ఒత్తిడి చేశారు. దీంతో జగన్నాథరాజు కాలకృత్యాలకు వెళ్లి వస్తానని చెప్పి దిగి పక్కనున్న పొలాల్లోకి పారిపోయాడు. కొంత దూరం పోయిన తర్వాత స్పృహ తప్పి పడిపోయి ఉండడాన్ని గమనించిన కిడ్నాపర్లు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా చనిపోయాడని కిడ్నాపర్లు డ్రైవర్ శంకర్‌కు సమాచారం ఇచ్చారు. జగన్నాథరాజు భార్య రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలెట్టారు. ఈ కేసులో ప్రధానంగా జేసీబీ యంత్రాలు విక్రయించే ఏజెంట్లు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురానికి చెందిన లక్కోజి సతీష్, అనపర్తి అనిల్ కుమార్ ద్వారా జగన్నాథ రాజు ఫైనాన్స్‌లో జేసీబీ, ఫోర్డ్ కారు తీసుకున్నారు. అయితే కంతులు కట్టలేదన్న కారణంతో ఏజెంట్లు ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు చెప్పారు. జగన్నాథరాజును కిడ్నాప్ చేయడంతో పాటు ఆ తర్వాత అతను మృతికి కారణమైన ఈ కేసులో నిందితులను శనివారం చిత్తూరు కట్టమంచి చెరువు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. వీరు ప్రయాణించిన కార్లను పూతలపట్టు సమీపంలోని బృందావన్ హోటల్ వద్ద పార్క్ చేసి ఉండగా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కర్నూలు జిల్లా కనకవేడుపేటకు చెందిన బోయ వీరేష్ (22), మునగాలకు చెందిన దాసరయ్య గారి పెద్దయ్య (48), ఏలూరు జిల్లా ముసనూరు మండలం కాత్రాయపాడుకు చెందిన గుత్తి నాగరాజు (34), భీమడోలుకు చెందిన దాసరి చంద్రయ్య(43), బోడవరం గ్రామానికి చెందిన సత్య బాబు (24), శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిన్నయ్యపేటకు చెందిన మణికంఠ (26), విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చొడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన గుడివాడ ఆదర్శ్ (20), గుడివాడ మణికంఠ (22), తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం పాలచర్లకు చెందిన భావిశెట్టి శివసత్యనారాయణ(27), నల్లజేర్ల మండలానికి చెందిన అనిల్ కుమార్ ఉన్నారు. ఈ కేసులో సీఐ లక్ష్మీ నారాయణతో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ అభినందించారు.